క్లుప్తంగా

జహీరాబాద్ ఎస్ఐగా వినయ్‌కుమార్



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ టౌన్ ఎస్ఐగా వినయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. జహీరాబాద్ ఎస్ఐగా ఉన్న కాశీనాథ్ సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వినయ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 93 సీసీ కెమెరాలను ప్రారంభించడానికి ఎస్పీ పరితోష్ పంకజ్ జహీరాబాద్‌కు వచ్చిన రోజే ఎస్ఐ కాశీనాథ్ బదిలీకావడం చర్చనీయాంశమైంది.

వర్షం.. హర్షం



ఝరాసంగంలో కురుస్తున్న వర్షం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. మేలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తుకున్నారు. వారం రోజులుగా వర్షం ముఖం చాటేయడంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు రైతులు ఆందోళన చెందారు. శనివారం సాయంత్రం ఒక్కసారిగా గంటసేపు ఏకధాటిగా వర్షం కురిసింది. మరోరెండు రోజుల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగనున్నాయి. వర్షం కురవడంతో విత్తనాలు వేయడం ప్రారంభించనున్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయం చుట్టూ శిఖరాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని సంగుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, మహాబలి నివేదన, హోమం, పూర్ణాహుతి తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ సోదరుడు రాంచందర్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు, జోగిపేట మాజీ కౌన్సిలర్ సురేందర్‌గౌడ్ భక్తులు, గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ బీజేపీ కార్యవర్గం శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యవర్గం నిర్వహించారు. ఈ సమావేశంలో అమీన్‌పూర్ బీజేపీ మండల కమిటీని 12 మంది పదాధికారులు, 33 మంది సభ్యులతో కలిపి మొత్తం 45 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అంజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కంగ్టి(నారాయణఖేడ్): రైతుల కోసం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి హరీశ్‌పవార్ తెలిపారు. మండలంలోని తడ్కల్ పరిసర గ్రామాల్లో వరి పంట విస్తీర్ణం అధికంగా ఉంటుంది. జీలుగ విత్తనాలు పొలం మడిలో వేసి పచ్చిరొట్ట ఎరువు తయారు చేసుకోవాలని సూచించారు. బస్తా జీలుగ విత్తనాలు ధర రూ. 4275 ఉంది. రైతులకు 50 శాతం సబ్సిడీ పోను రూ. 2138లు చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు తడ్కల్‌లోని ఆకా సెంటర్‌లో సమర్పించి కొనుగోలు చేయాలన్నారు. ఒక్కో బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని చెప్పారు.

13న స్పాట్ కౌన్సెలింగ్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రం సమీపంలోని గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 13న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ విద్యార్థులు మాత్రమే హాజరుకావాలని అడ్మిషన్ కోసం అభ్యర్థులు 13న ఉదయం 10 గంటల వరకు గిరిజన గురుకుల పాఠశాల సంబంధిత సర్టిఫికెట్లతో రావాలని ప్రిన్సిపాల్ సూచించారు.



జహీరాబాద్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రశేఖర్



న్యాల్‌కల్: టీజీఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ అహ్మద్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు



నారాయణఖేడ్: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు జిల్లావ్యాప్తం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం ఉదయం ఆయా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని పలువురు మతపెద్దలు సందేశం వివరించారు. సమైక్యత, సోదర భావాన్ని అందరూ అనుసరించాలని ఆకాంక్షించారు.



రామచంద్రాపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కంగ్టి: తడ్కల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సదాశివపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



జోగిపేటలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

రైతుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

పటాన్‌చెరు టౌన్: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునికతను జోడించి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రైతుల ఆర్థిక అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు దన్నుగా నిలవాలని కోరారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని పీఏసీఎస్ ఆవరణలో రూ.40 లక్షల నిర్మించిన దుకాణాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటల నిలువ కోసం ఆధునిక గోదాములు నిర్మించామన్నారు. దుకాణాల సముదాయాలు ద్వారా పీఏసీఎస్ లకు ఆర్థిక లభ్యత పెరుగుతుందని తెలిపారు. రానున్న వర్షాకాలంలో అర్హులైన రైతులకు రుణాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హాజరైన పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్‌రెడ్డి, రాజు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, పాలక మండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.



దుకాణాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పన్ను బకాయిదారులకు నోటీసులు జారీ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో సకాలంలో పన్ను చెల్లించని బకాయిదారులకు వార్డు ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి నోటీసులు అందజేశారు. పన్ను చెల్లింపులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాల ని వార్డు ఆఫీసర్లు కోరారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు వినోద్, బకాయిదారులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఎల్ఓసీ అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ఆపద సమయంలో సీఎం సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీనగర్ కాలనీకి చెందిన పున్నయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మెరుగైన వైద్య కోసం ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన రూ.2లక్షల విలువైన ఎల్‌ఓసీ అనుమతి పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పున్నయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జగన్, తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో బడీడు పిల్లల గుర్తింపు



రాయికోడ్: బడిబాటలో ప్రత్యేకతలను వివరిస్తున్న శ్రీనివాస్



నారాయణఖేడ్‌లో నిర్వహిస్తున్న బడిబాట

రాయికోడ్(అందోల్): బడిబాటలో బడీడు పిల్లలను గుర్తిస్తున్నామని రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాయికోడ్‌లోని వివిధ వాడల్లో టీచర్లు, ఎంఆర్సీ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగురు చిన్నారులకు ఒకటో తరగతిలో అడ్మిషన్లు ఇచ్చామన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యాపథకాలు, విద్యాబోధనతో పిల్లలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి, శోభ, యాదవులు, ఎంఐఎస్ మోహన్ సీఓ అనిల్, సీఆర్పీ రాజు, దత్తు ఉన్నారు.

ఖేడ్‌లో బడిబాట

నారాయణఖేడ్: ఖేడ్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూనగర్, శాస్త్రీనగర్, రాంమందిర్ గల్లీ, సువర్ణ షెట్కార్ థియేటర్ రోడ్డుపక్కన ఉన్న కాలనీల్లో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సదుపాయాలను గురించి వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు.

పాఠ్యపుస్తకాలు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసినట్లు మండల విద్యాధికారి కుమారస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఆర్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు యూనిఫామ్స్‌ను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలో ఉన్నత విద్యాభ్యాసంపై తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం గుమ్మడిదలలో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. మండలంలోని దాదిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేశ్ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డితో కలిసి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.



ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న అంజిరెడ్డి

పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): ఏటా పప్పుధాన్యాల ఉత్పత్తులు తగ్గుతున్నందున దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పప్పుధాన్యాల విత్తనాలు శనివారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని నాగుర్(కే), నాగుర్(బీ), భీంరా, తుర్కవడ్గాం, దెగుల్‌వాడి గ్రామాల శివారులో 400 ఎకరాల్లో మంచి రకం కంది, మినుము, పెసర విత్తనాలు విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ రైతులకు కందిలో ఎండుతెగులు, బెట్టను తట్టుకొని మంచి దిగుబడులు ఇచ్చే రకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 300 ఎకరాలకు సరిపడా కంది విత్తనాలు 75 ఎకరాలకు సరిపడ మినుము, 25 ఎకరాలకు సరిపోయే పెసర విత్తనాలు పంపిణీ చేసినట్లు ఎంఏఓ హరీష్ పవార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న హరీశ్‌పవార్, భార్గవ్

ముగిసిన మహారుద్రయాగం



దత్తగిరిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో 41 రోజులుగా చేపట్టిన మహా రుద్ర యాగం శనివారంతో ముగిసింది. ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహరాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వాముల ఆధ్వర్యంలో ఆశ్రమ ఆవరణలో యాగం నిర్వహించారు. దత్తయజ్ఞం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో మాతశ్రీ అనసూయ మాత దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, రాజయ్య స్వామి, నందినిమాత, కేతకీ ఆలయ మాజీ చైర్మన్ నీల వెంకటేశం పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న బాల్‌రెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్ చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా రాణి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొందన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు హనుమంత్ రెడ్డి, సంధ్యా జైపాల్ రెడ్డి, శైలజ పుండరీకం, కాలనీవాసులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఐటీఐ ప్రాంగణం

- కంపుతో విద్యార్థులకు ఇబ్బందులు
- మరోపక్క అధ్యాపకుల కొరత



తరగతి గదులను ఆనుకుని నిలిచిన మురుగునీరు, పిచ్చిమొక్కలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఐటీఐ కళాశాలలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క అపరిశుభ్రత వాతావరణం మరోపక్క అధ్యాపకుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అనేక ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతున్న పరిష్కరించే నాథుడే లేరు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ ఐటీఐ కళాశాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు చిన్న చూపుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

2002లో కళాశాల ప్రారంభం..

పటాన్‌చెరులో ఐటీఐ కళాశాలను ప్రారంభించారు. అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో 2002లో రామచంద్రాపురంలో నూతన భవనాన్ని నిర్మించి ఇక్కడికి తరలించారు. 2002లో ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు విద్యార్థులు సమస్యలతో పోరాడుతున్నారు. గతంలో తరగతి గదుల్లో గచ్చు పూర్తిగా కుంగిపోవడంతో దాతల సహకారంతో మర్మమతులు చేశారు.

170 మంది విద్యార్థులు..

ప్రస్తుతం ఐటీఐ కళాశాలలో 170 మంది విద్యార్థులు 10 ట్రేడ్‌ల్లో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నా అక్కడి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

మురుగు కంపు..

కళాశాల ప్రాంగణంలో తరగతి గదులను అనుకుని పెద్ద ఎత్తున మురుగు నీరు చేరడంతో విద్యార్థులు మురుగు కంపుతో నరకయాతన పడుతున్నారు. దానితో పాటు పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులకు, దోమలకు నిలయం మారింది. తరగతి గదిలో విద్యార్థులు కూర్చోలేని పరిస్థితి నెలకొంది.

దుర్వాసన వస్తోంది



కళాశాల ప్రాంగణంలో మురుగు నీరు నిలవడంతో దుర్వాసన వస్తుంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. తరగతి గదులను అనుకుని పిచ్చిమొక్కలు పెరగాయి. అపరిశుభ్రంతో విష జ్వరాలు వస్తాయేమోనని భయపడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి.

– సుభాష్, విద్యార్థి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళాశాలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని పోవడం జరిగింది. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– శ్రీనివాస్ రావు, ఐటీఐ ప్రిన్సిపాల్

మురుగు నీరు మళ్లింపు

జాతీయ రహదారిని అనుకుని ఐటీఐ కళాశాల ఉంది. వర్షం పడిన సమయంలో రోడ్డుపై నిలిచిన మురుగనీటిని కొందరు కళాశాల ప్రాంగణంలోకి మళ్లించారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా మురుగు నీటితో నిండిపోయింది. ప్రధాన గేట్ ముందు పెద్ద ఎత్తున మురుగు నీరు చేరింది.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

కళాశాల ప్రాగంణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దాంతో మ్యాన్‌హోల్స్ వద్ద మురుగు నీరు పొంగిపొర్లుతోంది.

అధ్యాపకుల కొరత..

ఐటీఐ కళాశాలలో 15 మంది అధ్యాపకులు ఉండాలి.. 10 అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. దాంతో ఉన్న సిబ్బందే అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్ చెరు): రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయనగర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాధవానంద సరస్వతీ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నాగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

◆ ఘన సన్మానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యూనియన్(కేపీఎస్)అధ్యక్షుడిగా గెలుపొందిన కొత్తగొల్ల చంద్రశేఖర్‌కు శనివారం పెద్దాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బురుగడ్డ నగేష్ హాజరై చంద్రశేఖర్‌ను కులసంఘం పెద్దలతో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పోరాడుతూ భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలన్నారు. సంఘం నాయకులు పాండు, సోమశేఖర్, పెద్దగొల్ల నగేష్, మల్లన్న, కృష్ణ, రమేష్, విఠల్, కిరణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది శనివారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ కోసం మున్సిపాలిటీ ద్వారా చెత్త సేకరణ వాహనాలను కాలనీలకు పంపిస్తున్నామని కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేసి సహకరించాలని, పట్టణ పరిశుభ్రతకు పట్టణ వాసులు సహకరించాలని కోరారు.

◆ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెటల్‌కుంటలో నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవం ముగిశాయి. వారం రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం ఉదయం మంటప దేవత పూజ, ధ్వజస్తంభం నాగదేవత, నవగ్రహాలు, స్వామివారి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ చంద్రశేఖర్, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీటి తంటాలు



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జిన్నార (పటాన్‌చెరు):గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ఐదు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడితో స్థానికులు సతమతమవుతున్నారు. అత్యధిక జనాభా కలిగిన గ్రామానికి తాగు నీరు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు అధికారుల తీరుపై మండిపడ్డారు. తాగునీటికి ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు ఖాళీ బిందెల తో నిరసనకు దిగారు. స్థానిక పరిశ్రమల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ద్వారా నీరు సక్రమంగా అందించడం లేదని, మురికి కాలువలు, వీధిదీపాల నిర్వహణ కూ డా చేపట్టడం లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని తమ కు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.